

# మడి మాణిక్యాలు



పుడమి పచ్చని సొబగులందుకున్నది. 'నాట్ల' నర్తనంతో పులకించింది. వనపర్తి జిల్లాలో వరినాట్ల పనులు జోరుగా సాగుతున్నాయి. రైతుబంధు పెట్టుబడి సాయం డబ్బు లు ఇప్పటికే ఖాతాల్లో జమ కావడం.. మరో వైపు రెండ్రోజుల నుంచి ముసురు వర్షాలు కురుస్తుండడంతో ఉత్సాహంగా సాగు పనుల్లో కర్షకులు నిమగ్నమయ్యారు. బుధవారం పెద్దమందడి మండలం అల్వాల గ్రామ శివారులో కరిగెట్లు చేసే పనిలో భూమి పుత్రులు నిమగ్నం కాగా.. మహిళా కూలీలు మాత్రం నాట్లు వేస్తూ సందడిగా కనిపించారు. ఈ దృశ్యాలను 'నమస్తే' ఫొటోగ్రాఫర్ క్లిక్ మనిపించాడు. - వనపర్తి ఫొటోగ్రాఫర్, జూలై 19

# సర్కారు బడులకు మహర్దశ

- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు
- చౌదర్‌పల్లిలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ



అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న విప్ గువ్వల బాలరాజు

వంగూరు, జూలై 19 : సీఎం కేసీఆర్ నేతృత్వంలో సర్కారు బడులకు మహర్దశ చేకూరిందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో రూ.12లక్షలతో చేపట్టిన పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు పాఠశాలలకు సన్నబియ్యం, ఉచిత పుస్తకాలతోపాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తుండటంతో విద్యార్థులు ఎక్కువగా చేరుతుండడంతో 100శాతం హాజరు పెరిగిందన్నారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యావ్యవస్థపై చిన్నచూపు చూశాయని, నేడు సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అంతకుముందు గ్రామంలో కలియ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు హమీద్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవో శంకర్, నాయకులు గణేశ్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, నర్సింహారెడ్డి, దేవా, జంగయ్య, నాగేశ్, ప్రవీణ్‌రెడ్డి, మొగులయ్య, ఎల్లాగౌడ్, నర్సిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముసురుకుంది

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20.2 మి.మీ. వర్షపాతం
- కల్వకుర్తిలో అత్యధికంగా 4.2 మిల్లీమీటర్లు..

మహబూబ్‌నగర్, జూలై 19 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ముసురేసుకున్నది. సోమవారం రాత్రి ప్రారంభమైన వర్షం ఏకదాటిగా కురుస్తూనే ఉన్నది. వరదలు లేకపోయినప్పటికీ భూమి పదును అయినట్లు వాతావారణ శాఖ పేర్కొంది. భారీ వర్షాలు ఉన్నట్లు ఇప్పటికే వాతావారణ శాఖ హెచ్చరించింది. ఈ ముసురుకు కొనసాగింపుగా భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలతోపాటు ప్రాజెక్టులకు వరద చేరుకునే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా కల్వకుర్తిలో 4.2 శాతం నమోదైంది. ముసురుతో రైతన్నలు వరి నాట్లలో బిజీబీజీగా గడుపుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు ఇంటికే పరిమితం కావడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

# పెద్దవాగుపై నాలుగు లేన్ల బ్రిడ్జి

- నాణ్యతా ప్రమాణాలతో హై లెవల్ వంతెన : ఎమ్మెల్యే అబ్రహం
- రూ.5.70కోట్లతో పనులు ప్రారంభం

అయిజ, జూలై 19 : నాణ్యతా ప్రమాణాలతో నాలుగు లేన్ల హై లెవల్ వంతెన నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే అబ్రహం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పెద్దవాగుపై రూ.5.70కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నాలుగు లేన్ల హై లెవల్ వంతెన పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిజ పట్టణం దినదినాభివృద్ధి చెందుతుండటంతో పెద్దవాగుపై శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి స్థానంలో కొత్త వంతెనను నిర్మిస్తున్నామన్నారు. పట్టణ జనాభా పెరుగుతుండడంతో ప్రజల సౌలభ్యం కోసం సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఈఎన్‌సీతో చర్చించి టెండర్ పూర్తి చేయించామన్నారు. ప్రభుత్వం రూ.7కోట్లు విడుదల చేసిందన్నారు. రూ.5.70కోట్లతో ఎల్ఎస్ఆర్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సుధీర్‌రెడ్డి పనులు దక్కించుకుని బ్రిడ్జి పనులు చేపట్టారన్నారు. మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.15 కోట్లతో పట్టణంలోని ప్రధాన రహదారిపై డివైడర్, సెంట్రల్ లైటింగ్, పట్టణ ప్రకృతి వనాలు, అత్యాధునిక వైకుంఠధామం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటివి ఏర్పాటు చేశామన్నారు. ఐకమత్యంతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. పార్టీలకతీతంగా కలిసొస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ కిరణ్, ఏఈ మహేశ్, కౌన్సిలర్లు సురేశ్, నర్సింహులు, రైతుసంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎల్ఎస్ఆర్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



అయిజ పట్టణంలో హై లెవల్ బ్రిడ్జి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

# నిధులు మంజూరు చేయాలి

- మంత్రికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే ఆల



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

మూసాపేట(అడ్డాకుల), జూలై 19 : రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వినతిప్రతం అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయానికి వెళ్లి మంత్రిని కలిశారు. కౌకుంట్ల నుంచి ఇస్రంపల్లి, పెద్దమునగల్‌చేడ్ మీదుగా అడ్డాకుల హైవే వరకు డబుల్ లేన్ రోడ్డు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. భూత్పూర్ నుంచి లంబాడికుంటతండా, కరివెన కురుమూర్తిరాయ రిజర్వాయర్ వరకు డబుల్ లేన్ రోడ్డు మంజూరుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నివేదికలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# టీబీ డ్యాంకు వరద



తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ

అయిజ, జూలై 19 : కర్ణాటకలోని తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న మోస్తరు వర్షాలకు టీబీ డ్యాంకు వరద చేరుతున్నది. బుధవారం డ్యాంలోకి 8,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 259 క్యూసెక్కులుగా నమోదైంది. తుంగభద్ర ప్రాజెక్టులో 105.855 గరిష్ఠ నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.774 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1,590.87 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తుంగభద్ర డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.

# కులవృత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- పాన్‌గల్‌లో గొర్రెల యూనిట్లు పంపిణీ



లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీరం

పాన్‌గల్, జూలై 19 : గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలమైన కుల వృత్తులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాన్‌గల్‌లో ప్రజాప్రతినిధులతో కలిసి 6గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అవిరల కృషి చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా రాష్ట్రంలోని సబ్బండ వర్గాల జీవితాల్లో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. 3గంటల కరెంట్ కావాలా? మూడు పంటల ప్రభుత్వం కావాలో ప్రజలకు తెలుసునని, కరెంట్‌పై కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారం మాట్లాడడం సమంజసం కాదన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.